సచివాలయాలు నిర్వీర్యం..!


జీవీఎంసీ 14వ వార్డులోని సచివాలయం

- చాలా కేంద్రాల్లో పనిచేయని ప్రింటర్లు
- స్టేషనరీ లేక ధ్రువపత్రాల జారీలో ఇబ్బందులు
- ఖాళీలు భర్తీ చేయని కూటమి ప్రభుత్వం

సీతమ్మధార : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో సచివాలయాల వ్యవస్థ నిర్వీర్యం అయిపోతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంతో చక్కగా పనిచేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు అధ్వానంగా మారిపోయాయంటే అతిశయోక్తి కాదు. కనీసం దరఖాస్తులు కూడా లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజలు పలు అవసరాల కోసం, కులం, ఆదాయం, నివాసం, కుటుంబ ధృవపత్రాల కోసం వస్తుంటారు. కానీ ''ఇక్కడ స్టేషనరీ లేదు..., పీడీఎఫ్ రూపంలో వాట్సాప్ చేస్తాం... బయట ప్రింటవుట్ తీసుకోండి'' అని కార్యదర్శులు సమాధానమివ్వడం ప్రజలకు తలనొప్పిగా పరిణమించింది. అలాగే ధ్రువపత్రాలు సిద్ధంగా ఉన్నాయి..., సచివాలయంలో తీసుకోండని మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వచ్చినా సచివాలయంలో మాత్రం చుక్కెదురవుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అదేమంటే ప్రింటర్లు పనిచేయనందున బయట ప్రింట్ తీసుకోండని ఖాళీ ధ్రువపత్రాల వెనుక సంతకాలు చేసి స్టాంప్ వేసి ఇస్తున్నారు. ఖాళీ పత్రాలు ఇలా బయటకి ఇవ్వడంతో నకిలీ ధ్రువపత్రాల బెడద పొంచి ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

గత ప్రభుత్వ హయాంలో సచివాలయాలను తరచూ జీవీఎంసీ అధికారులు తనిఖీ చేసి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసేవారు. కూటమి ప్రభుత్వం హయాంలో అధికారులు ఎవరూ రాకపోవడంతో జోన్ – 3 పరిధిలోని తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లోని సచివాలయాల్లో అడ్మిన్లు, కార్యదర్శులు ఆడిందే ఆట, పాడిందే పాట చందంగా మారిందని పలువురు మండిపడుతున్నారు. సిబ్బంది ఎవరూ సమయపాలన పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు. తోటి సిబ్బంది మాత్రం మీటింగ్‌కి వెళ్లారనో, లేదంటే ఫీల్డ్‌వర్క్ నిమిత్తం వెళ్లారని కాకమ్మ కథలు చెబుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

73 సచివాలయాల్లో 57 ఖాళీలు

జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో గల తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లో మొత్తం 73 సచివాలయాలున్నాయి. ఈ సచివాలయాల్లో 28 ప్రింటర్లు మాత్రమే పనిచేయడం గమనార్హం. మరో 45 వరకు ప్రింటర్లు ఏడాది కాలంగా పనిచేయకపోవడంతో నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సచివాలయాల్లో 57 వరకు మున్సిపల్ శాఖకు సంబంధించిన కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ సచివాలయాల్లో మొత్తం 381 మంది వరకు అడ్మిన్లు, కార్యదర్శులు పనిచేస్తున్నారు. పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఖాళీగా ఉన్న కార్యదర్శి పోస్టులను కూటమి ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. ఫలితంగా మిగిలిన కార్యదర్శుల మీద పని ఒత్తిడి పెరుగుతోందని అంటున్నారు. ఈ కారణంగానే ప్రజలకు సకాలంలో సేవలు కూడా అందడం లేదని సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. సచివాలయాలకు ఏ పనిమీద ప్రజలు వెళ్లినా గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పలు సచివాలయాల్లో అధిక శాతం కంప్యూటర్లు పనిచేయడం లేదు. అలాగే ప్రింటర్లు కూడా పనిచేయడం లేదు. దీంతో కొన్ని కేంద్రాల్లో సిబ్బందే సొంతంగా డబ్బులు వెచ్చించి మరమ్మతులు చేయిస్తున్నారంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాల్లో పూర్తి స్థాయిలో కంప్యూటర్లు, ప్రింటర్లకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

అద్భుతంగా వేద సదస్యం


బీవీకే కళాశాలలో వేదపఠనం చేస్తున్న వేద పండితులు

సీతంపేట : వేద పండితుల వేద పఠనంతో స్థానిక బీవీకే కళాశాల ప్రాంగణం ఆధ్యాత్మికతతో పరిమళించింది. కాసలనాడు బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్‌లో గల బీవీకే కళాశాల ప్రాంగణంలో సంఘ సభ్యులతో ఆత్మీయ కలయిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శిష్టా లక్ష్మీ నరసింహమూర్తి, కార్యదర్శి శిష్టా క్షీరసాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమాజ సంక్షేమం కోసం ప్రముఖ వేద పండితులు వేద పఠనం చేశారు. ఈ వేద సదస్యంలో ప్రముఖ వేద పండితులు, సప్తరుషి పీఠం నిర్వహణాధిపతి మామిళ్లపల్లి మాధవశర్మ, వారి శిష్య బృందం పాల్గొని వేద పఠనం చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. కవి, రచయిత దేవులపల్లి దుర్గాప్రసాద్ చేసిన వ్యాఖ్యానం ఆకట్టుకుంది. సంఘ సభ్యుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేశారు. సంఘ సభ్యులకు, కుటుంబ సభ్యులకు ఆటవిడుపుగా పురాణ విశేషాలపై ప్రశ్నలతో క్విజ్ పోటీ నిర్వహించారు. శిష్టా అంజన సంస్కృతి గాత్ర కచేరీ అలరించింది. కార్యక్రమంలో సంఘ సభ్యులు కాలనాథభట్ల శ్రీరామశాంతి స్వరూప్, మామిళ్లపల్లి నాగబాబు, మిస్సుల సూర్యనారాయణ, మిస్సుల రామాంజనేయులు, నూకల నరసింహమూర్తి, మిస్సుల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎర్నిమాంబకు పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజరి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

అమరజీవికి ఘన నివాళి


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సీతంపేట : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సీతంపేటలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఆ మహనీయుని చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు మాట్లాడే వారందరికీ భాషా ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండు సురేష్ బాబు, అమరాపు దుర్గ, నారా నాగేశ్వరరావు, కోసూరి శ్రీనివాస్, కందుల రాజశేఖర్, సూర్యప్రకాష్, గౌరి, పి.వి.నరసింహ, లలిత, పద్మ కుమారి, సుధీర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య గొడవ

మద్దిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు స్నేహితుల మధ్య మద్యం మత్తులో గొడవ జరిగింది. మోహన్ సాయి అనే యువకుడిపై కార్తీక్ అనే వ్యక్తి బీర్ బాటిల్‌తో దాడి చేసినట్లు సమాచారం. గతంలో ఇద్దరి మధ్య వివాదం జరిగిందని, ఆ విషయమై క్షమాపణ చెబుతానని మోహన్‌సాయిని కార్తీక్ పిలిచి దాడికి పాల్పడడంతో మోహన్ సాయికి గాయాలయ్యాయి. గాయపడ్డ సాయిని ఆస్పత్రికి తరలించారు. కార్తీక్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసు విషయమై పోలీసులు స్పందించడం లేదు. బాధితులు కూడా మీడియాకు సమాచారం అందించడానికి ఆసక్తి చూపడం లేదు.

చిల్లర నాణేలు పంపిణీ


నాణేలు పంచుతున్న బ్యాంకు సిబ్బంది

సీతమ్మధార: వినియోగదారులకు, వర్తకులకు చిల్లర నాణేలు కొరత లేకుండా సీతమ్మధార రైతుబజారులో కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు సభ్యులు ఆదివారం పంపిణీ చేశారు. రైతులకు, వినియోగదారులకు రూ.3.50 లక్షల విలువ గల రూ.1 నుంచి రూ.20ల వరకూ గల అన్ని చిల్లర నాణేలు, నోట్లు అందజేశారు. బ్యాంకు ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.శ్యామ్ కిషోర్, మేనేజర్ కె.విశ్వనాథం, ఇతర సిబ్బంది పాల్గొని పంపిణీ చేశారు. అనంతరం శ్యామ్ కిషోర్ మాట్లాడుతూ బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని రైతుబజార్లలో చిల్లర నాణేలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బందితో పాటు రైతుబజార్ ఈవో కొండబాబు, అటెండర్ సతీష్ పాల్గొన్నారు.

త్రిమూర్తి స్వరూపం దత్తాత్రేయుడు


లలితాపీఠంలో దత్తాత్రేయునికి క్షీరాభిషేకం, లలితాపీఠంలో దత్తాత్రేయ హోమంలో భక్తులు

సీతంపేట : అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో ఆదివారం దత్తాత్రేయ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠంలో గల దత్తాత్రేయునికి విశేష క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చన జరిపారు. అనంతరం దత్తాత్రేయ హోమం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయుడు భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు పాల్గొని దత్తాత్రేయునికి అభిషేకం, పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అంశతో అవతారమెత్తిన దివ్యమూర్తి దత్తాత్రేయుడని, మూడు శిరస్సులు, ఆరు చేతులు కలిగి ఉంటారని తెలిపారు. దత్తాత్రేయుడిని పూజిస్తే జ్ఞానం, వివేకం, ధార్మికత, ఆత్మవిశ్వాసం లభిస్తాయన్నారు.

వాకర్స్ ఉద్యమానికి సంపూర్ణ సహకారం


సమావేశంలో మాట్లాడుతున్న కమల్ బైద్

మురళీనగర్ : వాకర్స్ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్దామని వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 కాన్ఫరెన్స్ చైర్మన్ కమల్ బైద్ అన్నారు. ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ అధ్యక్షతన మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో జిల్లా 101 కోర్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ సెక్రటరీ జనరల్ వాకర్ రాళ్లపల్లి సత్యనాథం మాట్లాడుతూ ఈ నెల 28, 29న ఏలూరులో నిర్వహించనున్న వార్షిక కన్వెన్షన్‌లో గవర్నర్ పదవీ ప్రమాణ స్వీకారం, జనవరి 11న కేబినెట్ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఆర్‌సీ – 5 ఉప్పలపాటి శుభ, కేబినెట్ కార్యదర్శి ఆర్ఎస్.మహేశ్వరరావు, డైరెక్టరీ ఎడిటర్ దర్భా శిరీష, కోశాధికారి లక్ష్మణ రావు, ముఖ్య సలహాదారులు విజయ ప్రసాద్, మద్దుల రాంజీ, సోమశేఖర్, కె.మాధవి, వి.ప్రమీల, జిల్లా 101 ఐటీ కో ఆర్డినేటర్ సీహెచ్.జ్యోతి, 101 జాలీ వాకర్ నానుపాత్రుని ప్రకాశరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రోణంకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైవిధ్యభరిత సంస్కృతి భారత్ సొంతం


నృత్యం చేస్తున్న కళాకారులు

సీతమ్మధార: అత్యంత వైవిధ్యభరితమైన సంస్కృతులు, సంప్రదాయాలు అనుసరిస్తూ భారతీయ శాస్త్రీయ నృత్యాలకు ఆదరణ కల్పిస్తూ స్కూల్ అఫ్ థియేటర్ ఆర్ట్స్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ సంయుక్తంగా కలకత్తాకు చెందిన జాతీయ కథక్ డ్యాన్సర్ పాయల్ మల్లిక్‌ను యంగ్ ఇండియన్ క్వీన్ అఫ్ కథక్ పురస్కార్‌తో ఆదివారం సత్కరించారు. సీతమ్మధార ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాధవ్ మాట్లాడుతూ నృత్యానికి సరిహద్దులు లేవని, ప్రపంచంలో మరెక్కడా లేని అత్యంత వైవిధ్యభరితమైన సంస్కృతులు, సంప్రదాయాలు భారతదేశానికి సొంతమన్నారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ఏపీ ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ భారతీయ కళలు, సంస్కృతులను పరిరక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అనంతరం నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అతిథులు జాతీయ కథక్ డ్యాన్సర్ పాయల్ మల్లిక్‌ను సత్కరించి, జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా స్కూల్ అఫ్ థియేటర్ ఆర్ట్స్ చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు.

ముగిసిన ఘంటసాల గానోత్సవాలు


పోలీస్ కమిషనర్‌ను సత్కరిస్తున్న ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఘంటసాల గానోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఘంటసాల గీతాలు అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. గాయకులను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు నేతృత్వం వహించిన కార్యక్రమంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, సంస్థ గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగర సీపీని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

అలరించిన ఘంటసాల గానోత్సవాలు..

ముందుగా జరిగిన సంగీత విభావరిలో బంగారాజు, భాగ్యలక్ష్మి, విశ్వప్రసాద్, కోమలి, రామ నరసింహం పాడిన తెల్లవార నీకు ఈరేయిని వంటి గీతాలు ఆకట్టుకున్నాయి. వీరితో పాటు వీరేంద్ర, షాను బొమ్మిడి సత్యనారాయణ, రాము, మనోహర్ తదితరులు ఘంటసాల గీతాలు చక్కగా ఆలపించారు. సోమేష్ సంగీత సారథ్యంలో జరిగిన విభావరికి మధుపాడ రమణి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

వైద్య శిబిరానికి స్పందన

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం గాంధీనగర్ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ రహమతుల్లా ఆస్పత్రి అధినేత రహమతుల్లా ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి రోగులను పరీక్షించారు. బీఎండీ, థైరాయిడ్, షుగర్, యూరిక్ యాసిడ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.

ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు


మాట్లాడుతున్న రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని గాంధీనగర్‌లో క్రిస్మస్ ఆరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మాధవధార గాంధీనగర్ – 2లో ఉన్న విక్టరీ హోలీ స్పిరిట్ ప్రేయర్ చర్చిలో పాస్టర్ జోసఫ్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్లంతా భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నారని, జీసస్ ఎల్లవేళలా చల్లగా కాపాడుతారన్నారు. అనంతరం ఏసు ప్రభు ప్రార్థన, ఆరాధన చేశారు. ఈ సందర్భంగా రెయ్యి వెంకటరమణను శాలువాతో సత్కరించి దీవెనలు అందించారు.

కేవీల్లో చక్కగా విద్యా బోధన


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శ్రీవిజయనగర్ కాలనీలో గల కేంద్రీయ విద్యాలయం – 2లో విద్యాలయ సంఘటన్ 62వ స్థాపన దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు లలితకుమారి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం లలితకుమారి మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలు విలువలతో కూడిన విద్య బోధిస్తాయని, భారతీయ సంస్కృతి, జాతీయ సమైక్యతకు అద్దం పడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బాలాజీ, రామచంద్రరావు, లక్ష్మి, శివకుమార్ జ్యోత్స్న, జ్యోతిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాల ఆత్మీయ కలయిక


ఆత్మీయ సమావేశంలో పోలీసు కుటుంబాల సభ్యులు

మద్దిపాలెం: 14వ సీరియల్ బ్యాచ్‌కు సంబంధించిన పోలీసుల కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం 51వ వార్డులో ఆదివారం జరిగింది. పోలీస్ ఉద్యోగంలో చేరి 34 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కుటుంబ సభ్యులతో మాధవధార తోటలో ఆనందంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారంతా ఒకచోటకు చేరి ఆత్మీయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. 1990వ సంవత్సరంలో ఒకే చోట ట్రైనింగ్ పూర్తి చేసుకుని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కుటుంబ సభ్యులతో కలుసుకోవడం ఆనందంగా ఉందని వారంతా పేర్కొన్నారు.

వైభవుని సన్నిధిలో ధనుర్మాసోత్సవాలకు ఏర్పాట్లు


వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి జనవరి 13 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అనంతరం రంగనాథ స్వామికి తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరపున పాశురం విన్నవిస్తామన్నారు. 17 నుంచి జనవరి 13 వరకు రోజూ ఉదయం 4 గంటలకు ప్రాతఃకాలార్చన, తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం, పాశుర విన్నపం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహిస్తామన్నారు. జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు, పాశుర విన్నపం, తీర్థ ప్రసాద గోష్ఠి ఉంటుందన్నారు. జనవరి 8న పొన్నాకులతో వైభవ వేంకటేశ్వరస్వామికి హారతి సమర్పిస్తారని తెలిపారు. 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, ఉదయాస్తమాన సేవ, వైభవ వేంకటేశ్వరుని సర్వాంగ వజ్రకవచ విశ్వరూప దర్శనం కల్పిస్తామన్నారు. 11న కూడారై పాశుర విన్నపం, కూడారై విశేష భోగం, తీర్థ ప్రసాద గోష్ఠి, 13న సాయంత్రం శ్రీగోదా రంగనాథుల కళ్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఆ రోజు పౌర్ణమి మహాస్నపనంలో భాగంగా స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారన్నారు. పూజల్లో పాల్గొనదలచిన వారు అర్చక స్వాములను సంప్రదించాలని ఈవో సూచించారు. గోదారంగనాథుల ఆర్జిత కల్యాణంలో పాల్గొనదలచిన వారు రూ.500లు చెల్లించాలని సూచించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ చంద్రశేఖర్

మద్దిపాలెం : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం షాపుల వద్ద తాగి అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, పద్ధతి మార్చుకోకపోతే అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. వారి కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగకుంటే చర్యలు

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి.వెంకటరావు హెచ్చరించారు. ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ల రోజు వారీ కార్యకలాపాలపై నిత్యం నిఘా ఉంటుందని, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మంచిగా లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

ఉత్సాహంగా పోర్టు స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పోర్టు స్కూల్ పూర్వ అధ్యాపకులు, అసోసియేషన్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: విశాఖ పోర్టు స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. పోర్టు స్కూల్‌లో ప్రారంభం నుంచి చివరి వరకు విద్యనభ్యసించిన వివిధ బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు సాలగ్రామపురంలో గల స్కూల్ ప్రాంగణంలో ఉత్సాహంగా గడిపారు. ఈ సమ్మేళనానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు నాగనబోయిన నాగేశ్వర్రావు మాట్లాడుతూ పోర్టు స్కూల్‌లో చదువుకున్న వారంతా నేడు ఉన్నత స్థానాల్లో దేశ విదేశాల్లో స్థిరపడ్డారన్నారు. సుమారు ఆరున్నర దశాబ్దాలపాటు 1965 నుంచి 2015 వరకు ఎందరో ఉత్తమ విద్యార్థులను పోర్టు స్కూల్ తీర్చిదిద్దిందని గుర్తు చేశారు. ఈ సమ్మేళనానికి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, తుని, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఈ పాఠశాలలో పనిచేసిన సుమారు 45 మంది అధ్యాపకులను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమ్మేళనంలో అనుపమ, దేముడుతోపాటు పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షులు ఆర్.అనిల్‌కుమార్, ఆర్.రమణబాబు, జి.చందు, సంయుక్త కార్యదర్శి జి.రమణబాబు, సహాయ కార్యదర్శి జి.ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఎ.హరి కుమార్, తదితరులు పాల్గొన్నారు.